సాక్షి
విశాఖపట్నం
శనివారం । 6 । జనవరి । 2024

సాంస్కృతిక వైభవం 8లో



న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న కడప అసిస్టెంట్ కలెక్టర్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం కడప అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మౌర్యా భరద్వాజ్ దంపతులు

వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అందజేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన మౌర్యా భరద్వాజ్ ఐఏఎస్ శిక్షణ అనంతరం కడపలో తొలి పోస్టింగ్ పొందారు. ఆయనకు గురువారం వివాహమైంది.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసంలో ఏటా కనకమహాలక్ష్మి అమ్మవారికి నిర్వహించే రథోత్సవ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరగనుంది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్ మీదుగా ఆలయం వరకు రథోత్సవం సాగనుంది.

3,055 మందికి కొత్తకార్డులు

సాక్షి, విశాఖపట్నం : పేదల సంక్షేమంపై నిరంతరం ఆలోచన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. రైస్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారికీ లబ్ధి చేకూర్చింది. అర్హులైన వారికి కొత్తగా బియ్యం కార్డుల మంజూరు ప్రక్రియను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఏటా రెండు సార్లు జూన్, డిసెంబర్‌లో అర్హులకు కొత్త కార్డులు అందజేస్తోంది. ఇప్పటి వరకు జిల్లా పరిధిలో కొత్తగా 3,055 రైస్ కార్డులకు ఆమోదం లభించడంతో లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్దార్ల డిజిటల్ సంతకాల ప్రక్రియ పూర్తి చేసి ఆయా మండలాల్లో పంపిణీ చేసినట్లు డీఎస్‌వో గొండు సూర్యప్రకాష్ తెలిపారు.

ఇద్దరు సీఐలకు స్థానచలనం

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హార్బర్ ట్రాఫిక్ సీఐను విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు. అలాగే సీసీఎస్–3లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.షణ్ముఖరావును హార్బర్ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.

హెచ్‌టీ వినియోగదారుల కోసం వర్చువల్ అకౌంట్ నంబర్లు

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ బిల్లుల చెల్లింపులకు హెచ్‌టీ వినియోగదారుల కోసం వర్చువల్ అకౌంట్ నంబర్ల (వాన్) కేటాయించినట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వాన్ నంబర్ల ప్రక్రియని కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ హెచ్‌టీ వినియోగదారుల బిల్లు చెల్లింపు సౌలభ్యానికి వర్చువల్ అకౌంట్ నంబర్లను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా కేటాయించామని తెలిపారు. వీరికి కేటాయించిన నంబర్లను వారి బ్యాంకు ఖాతాలకు అనుసంధానించుకోవడం ద్వారా బిల్లు చెల్లింపు లావాదేవీలు మరింత సులభతరం కానుందన్నారు. ఈ నంబరు ద్వారా ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్(ఫైనాన్స్) డి.చంద్రం, సీజీఎంలు పి.శ్రీనివాస్, ఎం.రవీంద్ర, ఎస్‌బీఐ డీజీఎం పంకజ్ కుమార్, ఆర్‌ఎం ఐ.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కైలాసగిరిపై స్కై బ్రిడ్జ్

- స్కై సైక్లింగ్.. జిప్‌లైన్‌కు టెండర్లు పూర్తి
- రెండు నెలల్లో పూర్తి
- 6 నెలల్లో అందుబాటులోకి స్కై బ్రిడ్జ్‌కు సన్నాహాలు
- వచ్చే నెలలో వీఎంఆర్‌డీఏ పార్క్ బీచ్‌లో ఓషియన్ డెక్ పనులకు అవకాశం
- ఎంజీఎం 7 ఎకరాల స్థలంలో ఫైవ్‌స్టార్ హోటల్, మైస్ సెంటర్
- వైశాఖ జల ఉద్యానవనంలో పిల్లల కోసం అమ్యూజ్‌మెంట్ ఫన్ జోన్
- మీడియాతో మెట్రోపాలిటన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

విశాఖ సిటీ: మాస్టర్‌ప్లాన్ రోడ్లు.. సెంటు స్థలాల లేఅవుట్లు.. జగనన్న ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్‌లు.. ఇలా ఒకవైపు ప్రజావసరాలకు అనువైన అభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్మాణాలు..కైలాసగిరి, తెన్నేటి పార్కుల పునరుద్ధరణ.. సీ హారియర్ మ్యూజియం.. హెల్త్ ఎరీనా జాగింగ్ ట్రాక్.. కొండకర్ల ఆవలో ఫ్లోటింగ్ జెట్టీ.. మరోవైపు పర్యాటకులను ఆకట్టుకొనే ప్రాజెక్టులకు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) విశాఖ ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోంది. సుందర విశాఖను పర్యాటకులకు స్వర్గధామంగా మలిచేందుకు మరిన్ని బృహత్తర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వీఎంఆర్‌డీఏ గత ఏడాది కాలంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటి ప్రగతి, భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులపై మెట్రోపాలిటన్ కమిషనర్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. వీఎంఆర్‌డీఏ గత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ 31వ తేదీ వరకు రూ.161 కోట్లు ఆదాయం రాగా.. రూ.215 కోట్లు వ్యయం జరిగినట్లు వెల్లడించారు. సెంటు స్థలాల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం బల్క్ ల్యాండ్ ప్రతిపాదనకు అంగీకారం తెలిపిందని, వాటి వేలం ద్వారా సంస్థకు ఆదాయం సమకూరుతోందని చెప్పారు.

ఫన్ ప్రాజెక్టులు.. స్టార్ హోటల్..

- పిల్లల కోసమే ప్రత్యేకంగా వైశాఖి జల ఉద్యానవనంలో 3.48 ఎకరాల్లో పీపీపీ విధానంలో రూ.40 కోట్ల అంచనా వ్యయంతో అమ్యూజ్‌మెంట్ అండ్ ఫన్ జోన్ ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించారు.
- అలాగే తెన్నేటి పార్కు బీచ్‌లో డిజైన్–ఇన్వెస్ట్–ఇన్‌స్టాల్‌మెంట్–ఆపరేషన్ విధానంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
- వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక ఉన్న 7.97 ఎకరాల్లో పీపీపీ విధానంగా రూ.220 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్, మైస్ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి జ్యుడీషియల్ రివ్యూ కోసం పంపించారు.
- నేచురల్ హిస్టరీ పార్క్ అండ్ మ్యూజియం రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు డీపీఆర్ సిద్ధం చేశారు. • ఎన్ఏడీ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు 25 శాతం మేర పూర్తయ్యాయి. 9 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. • 83 లేఅవుట్లలో 1,41,654 మందికి సెంటు స్థలాల పట్టాలు అందించారు. ఈ లేఅవుట్ల అభివృద్ధిలో వీఎంఆర్‌డీఏ ప్రముఖ పాత్ర పోషించింది. వీటిలో రూ.175 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించారు. • భూములు ఇచ్చిన రైతులకు 1,215 ఎకరాల్లో 48 లేఅవుట్లు అభివృద్ధి చేసి ప్లాట్లను కేటాయించారు. వాటి అభివృద్ధికి రూ.660 కోట్లు అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ నిధులను మూడు దశలలో ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే తొలి దశలో రూ.200 కోట్లతో క్వారీ రబ్బిష్ రోడ్లు, సీసీ డ్రైన్ల పనులు జరుగుతున్నాయి. ఫేజ్–2లో రూ.305 కోట్లతో బీటీ రోడ్లు, ప్లాంటేషన్, పార్కులు, ఎలక్ట్రిఫికేషన్ పనులు ప్రగతిలో ఉన్నాయి. ఫేజ్–3లో రూ.155 కోట్లతో నీటి సరఫరా కల్పించనున్నారు.
- ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నారు.

జగనన్న ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్‌కు మంచి స్పందన

- మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకు స్థలాలు ఇవ్వాలన్న సంకల్పంతో చేపట్టిన జగనన్న ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్‌కు మంచి స్పందన వస్తోంది.
- విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలో 204.96 ఎకరాల్లో లేఅవుట్లు వేసి 1280 ప్లాట్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.
- విజయనగరం జిల్లా రఘుమండలో ఉన్న 229 ప్లాట్లకు ఇప్పటికే 165 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో లాటరీ తీసి 160 మంది కేటాయింపులు చేశారు. అలాగే జియ్యానివలసలో 130 ప్లాట్లకు 66 దరఖాస్తులు రాగా 56 మందికి ఇచ్చారు. విశాఖలో పాలవలస 1, 2లలో 150 దరఖాస్తులకు గాను లాటరీ 94 ప్లాట్లు విక్రయించారు. ఇప్పటికీ వస్తున్న దరఖాస్తులను పరిశీలించి త్వరలోనే వాటికి లాటరీ ప్రక్రియను చేపట్టనున్నారు.

రూ.58.74 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి

- విశాఖలో రూ.58.74 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- బోయపాలెం హైవే నుంచి నుంచి కాపులుప్పాడ, బీచ్ రోడ్డులో సీతకొండ, పాయకరావుపేట రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. • అలాగే రూ.12 కోట్లతో లా కాలేజీ హైవే నుంచి పెబెల్ బీచ్ హౌసింగ్ వరకు ఫుట్‌పాత్, గ్రీనరీ, రూ.3.22 కోట్లతో విజయనగరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ జంక్షన్ నుంచి కేపీ పేట మీదగా పాల్ నగర్ జంక్షన్ వరకు రోడ్డు, రూ.9.7 కోట్లతో సబ్బవరం నుంచి గుల్లేపల్లికి, రూ.3.52 కోట్లతో యలమంచిలి రైల్వే స్టేషన్ నుంచి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు, రూ.7 కోట్లతో, మారికవలస జంక్షన్ నుంచి బీచ్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం పనులు దాదాపుగా తుది దశకు చేరుకున్నాయి.
- మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ 11 ఫ్లోర్లలో 9 ఫ్లోర్ల నిర్మాణం పూర్తయింది. ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేసే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. • భీమలాపల్లి, ఎండాడ లా కాలేజీ వద్ద చేపట్టిన కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం 30 శాతం పూర్తయింది.

కైలాసగిరిపై సరికొత్త ప్రాజెక్టులు

- పర్యాటకులను మరింత ఆకట్టుకొనే తరహాలో కైలాసగిరిపై గ్లాస్ స్కై వాక్ బ్రిడ్జ్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- ఆరు నెలల్లో దీని నిర్మాణం పూర్తిచేయాలన్న లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.
- దీంతో పాటు జిప్‌లైన్, స్కై సైక్లింగ్ సౌకర్యాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియను చేపట్టారు. రెండు నెలల్లోనే వీటిని ఏర్పాటు చేసి ప్రజలకు, పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించాలని భావిస్తున్నారు.
- అలాగే కైలాసగిరిపై 1.99 ఎకరాల్లో పీపీపీ విధానంలో రూ.18 కోట్లతో నేచర్ కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంట్, బీచ్ వ్యూ కేఫ్ నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఏడాదిన్నరలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.
- వీఎంఆర్‌డీఏ పార్కు లైహౌస్ వద్ద ఓషన్ డెక్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లను పూర్తి చేశారు.
- సీఆర్‌జెడ్ అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణాలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.
- కైలాసగిరిపై రూ.4.69 కోట్ల అంచనా వ్యయంతో సైన్స్ మ్యూజియం నిర్మాణానికి రెండు రోజుల క్రితమే శంకుస్థాపన చేశారు.
- అలాగే కొండపై డ్యాషింగ్ కార్, 12డీ థియేటర్, ఫ్లాష్ టవర్ ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేశారు.

గ్రీన్‌పోర్టు దిశగా అడుగులు

సాక్షి, విశాఖపట్నం : పర్యావరణ హితంగా గ్రీన్ పోర్టుగా అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నామని విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. పోర్ట్ అవసరాల కోసం కొనుగోలు చేసిన రెండు సీఎన్జీ బస్సులను, రెండు భారీ రోడ్ స్వీపింగ్ యంత్రాలను అంగముత్తు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్ట్ వాహన విభాగంలోకి మొట్టమొదటి సారిగా సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర భారత్‌లో భాగమని వెల్లడించారు. రాబోయే 3 ఏళ్లలో ఈ ప్రాజెక్ట్ కోసం రూ.9.68 కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టుతో పరిసరాల పరిశుభ్రత ప్రమాణాలు సాధించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు.



సీఎన్జీ బస్సులు ప్రారంభిస్తున్న చైర్మన్ అంగముత్తు

కాలం చెల్లిన సామగ్రిని తొలగించాలి

మహారాణిపేట: జిల్లా ఖజానా కార్యాలయం స్ట్రాంగ్ రూంలో కాలం చెల్లిన సామగ్రిని త్వరితగతిన తొలగించాలని జేసీ కేఎస్. విశ్వనాథన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తన చాంబర్లో ఖజానా, అకౌంట్స్, పోలీసు, న్యాయశాఖ, పంచాయతీరాజ్ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. 50 ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న సామగ్రిని నిబంధనల మేరకు వీలైనంత త్వరగా తొలగించాలని అధికారులను జేసీ ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఖజానా అధికారి వై. సుధాకర్ రావు, సహాయ ఖజానా అధికారి జి. నాగార్జున రావు, పోలీస్, పంచాయతీ రాజ్, న్యాయ శాఖ, ఎండోమెంట్, ఎన్నికల విభాగం, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మరో 3,937 మందికి రూ.5.58 కోట్ల లబ్ధి

- జిల్లాలో ద్వైవార్షిక సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్సీలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : అర్హత ఉండి కూడా సాంకేతిక కారణాల వల్ల గతంలో ఆర్థిక సాయం పొందలేకపోయిన లబ్ధిదారుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పిస్తూ వివిధ పథకాలను మంజూరు చేసింది. అందులో భాగంగా తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిధులను విడుదల చేశారు. లబ్ధిదారుల ఖాతాల్లో ఆయా మొత్తాలను జమ చేశారు. అనంతరం లబ్ధిదారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ నష్టపోవడానికి వీలు లేదని, పేదలకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. నవరత్నాలు–ద్వైవార్షిక నిధుల విడుదలలో భాగంగా వివిధ పథకాల కింద జిల్లా నుంచి 3,937 మంది ఆర్థిక లబ్ధి పొందారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎమ్మెల్సీలు పండుల రవీంద్ర బాబు, వరుదు కల్యాణి, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున,రెల్లి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదనరావు, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, మహిళా శిశువు సంక్షేమ శాఖ ప్రాంతీయ ఆర్గనైజర్ మాధవి వర్మ, వివిధ విభాగాల అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగం, నిధుల విడుదల అనంతరం జిల్లాకు చెందిన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీల చేతుల మీదుగా నమూనా చెక్కును అందజేశారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మేయర్ వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్ర

విప్లవాన్ని వివరిద్దాం

- విశాఖ ఉత్తరలో నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర
- పోర్టు ఆస్పత్రి రోడ్డు వద్ద బహిరంగ సభ
- హాజరుకానున్న మంత్రులు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జరగనుంది. జిల్లాలో మొదటి, రెండో విడతల్లో భీమిలి, గాజువాక, విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గంలో విజయవంతంగా యాత్ర సాగింది. అంతకు రెట్టింపు ఉత్సాహంతో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో బస్సుయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలూ సంతృప్తితో ఉన్నాయి. ఈ నేపథ్యంలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికారత పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తోంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూనే గత టీడీపీ ప్రభుత్వం పేద ప్రజలను మోసం చేసిన తీరును ఎండగట్టడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. ఈ యాత్రకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు హాజరుకానున్నారు. ఇప్పటికే సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పరిశీలించారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న కేకే రాజు

నార్త్‌లో సామాజిక ‘న్యాయం’

రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించారు. మూడు కార్పొరేషన్ చైర్మన్లు (యాత కార్పొరేషన్, కాకినాడ పెట్రో కారిడార్ చైర్‌పర్సన్, సిక్కు కార్పొరేషన్ చైర్మన్), జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్, 19 కార్పొరేషన్ డైరెక్టర్లు (9మంది బీసీలకు, 10 మంది వివిధ విభాగాల డైరెక్టర్లు), ఇద్దరికి సింహాచలం డైరెక్టర్లు, వైభవ్ వేంకటేశ్వరరావుస్వామి, శంకరమఠం శివాలయం, నక్కవానిపాలెం రోడ్డులో బోర్డు చైర్మన్లతో పాటు 40 మంది వరకూ బోర్డు సభ్యులుగా ఎస్సీ, బీసీలకు కల్పించారు. రాజకీయ పదవుల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 15మంది కార్పొరేటర్లలో ఆరుగురు బీసీలు, ముగ్గురు ఎస్సీలు, ఎస్టీ ఒకరు, ముస్లిం ఒకరు ఉన్నారు. ఎస్సీలకు ఒక డిప్యూటీ మేయర్, ఎస్టీకి జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, బీసీలకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కో ఆప్షన్ మెంబర్, ఆరుగురుకు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా పదవులు కల్పించారు.

బస్సు యాత్ర సాగనుందిలా...

- ఉదయం 10.30 గంటలకు విశాఖ ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్
- 11.30 గంటలకు అక్కయ్యపాలెం ఎన్‌జీవో కాలనీలో జీవీఎంసీ స్కూల్‌లో నాడు–నేడు భవనాల ప్రారంభం
- 12.00 గంటలకు మాధవధార గ్రాండ్ మిలాన్ ఫంక్షన్ హాల్ వద్ద లంచ్
- 2.30 గంటలకు గ్రాండ్ మిలాన్ ఫంక్షన్ హాల్ నుంచి పోర్టు ఆస్పత్రి సమీపంలో ఇనార్బిట్‌మాల్ రోడ్డు వరకూ భారీ బైక్ ర్యాలీ
- 3.00 గంటలకు పోర్టు ఆస్పత్రి సమీపంలోని ఇనార్బిట్‌మాల్ రోడ్డు వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నారు.

రూ.3,816 కోట్లతో సంక్షేమాభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో విశాఖ నార్త్ నియోజకవర్గంలో రూ.3,816 కోట్లతో సంక్షేమాభివృద్ధి జరిగింది. ఇందులో రూ.340 కోట్లతో అభివృద్ధి, రూ.3,816 కోట్లతో సంక్షేమ పథకాలు ఉన్నాయి. నియోజకవర్గంలో లబ్ధి పొందిన కుటుంబాల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలననే కోరుకుంటున్నారు. స్కూళ్ల విద్యార్థుల నుంచి వృద్ధుల వరకూ అందరూ జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొందినవారే. నియోజకవర్గ ప్రజలంతా సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయడానికి సిద్ధంగా ఉన్నారు.



– కె.కె రాజు, విశాఖ ఉత్తర సమన్వయకర్త

స్పీకర్ తమ్మినేనికి చికిత్స



తమ్మినేనిని పరామర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

ఎంవీపీ కాలనీ: అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గుండె సంబంధిత సమస్యతో ఆయన గురువారం శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో చేరగా శుక్రవారం ఆయనను మెరుగైన వైద్యం కోసం విశాఖ మెడికవర్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఐదుగురు సభ్యులతో కూడిన వైద్యుల బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కార్డియో, యాంజియోగ్రఫీ వంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు తమ్మినేనికి అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు.

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	625.00
విజయనగరం	629.00
శ్రీకాకుళం	629.00

సాగరతీరాన సాంస్కృతిక వైభవం

- ఏయూలో ప్రారంభమైన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్
- భిన్న సంస్కృతుల మేళవింపుగా ర్యాలీ
- నృత్యాలతో జోష్ నింపిన విద్యార్థులు



భాంగ్రా నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: డప్పుల చప్పుళ్లు.. థింసా, భాంగ్రా, మోహినియాట్టం నృత్యాలు.. తెయ్యం వేషధారణ.. అన్నమయ్య కీర్తనల ఆలాపనలు.. ఇలా విభిన్న సాంస్కృతిక కళారీతులకు విశాఖ వేదికైంది. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైన 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్(యువభేరి)లో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు తళుక్కుమన్నారు. తమ ప్రాంత సంస్కృతిని పరిచయం చేశారు. ఈ నెల 9 వరకు జరిగే ఈ సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలోని 23 విశ్వవిద్యాలయాలకు చెందిన 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏయూ పరిపాలన భవనం వద్ద సాయంత్రం విద్యార్థులతో సాంస్కృతిక ర్యాలీ అట్టహాసంగా ప్రారంభమైంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) టెక్నికల్ అబ్జర్వర్ మనీష్ జంగ్రా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి అమెరికన్ కార్నర్, ఏయూ ఇన్‌గేట్, ఏయూ పాతశాల, బీచ్‌రోడ్డు మీదుగా ఏ యూ కన్వెన్షన్ సెంటర్ వరకు సాగింది. ముందుగా న్యాయనిర్ణేతలు బ్యాటరీ వాహనంపై వెళుతూ విద్యార్థుల ర్యాలీని తిలకించారు. విద్యార్థులు తమ సంస్కృతి సంప్రదాయాలను, కళలను ప్రస్ఫుటం చేస్తూ.. సంగీత వాయిద్యాలకు అనుగుణంగా నర్తిస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. అనంతరం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మనీష్ జంగ్రా మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. నంది అవార్డు గ్రహీత కె.మహేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ కళ.. సమాజ చైతన్యం కోసమేనన్నారు. తాను ఏయూ పూర్వవిద్యార్థిగా చెప్పుకోవడానికి గర్విస్తానన్నారు. ఫెస్ట్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 40 విశ్వవిద్యాలయాలు దరఖాస్తు చేయగా.. 23 వర్సిటీలను ఎంపిక చేశామన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వందన సమర్పణ చేశారు. తొలి రోజు కార్యక్రమాలతో తీర్చిదిద్దిన ప్రత్యేక సంచికను ఏఐయూ ప్రతినిధులు విడుదల చేశారు. ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. ఏఐయూ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, ఏయూ సహకారంతో నిర్వహిస్తోంది.



యువభేరిలో భాగంగా సాంస్కృతిక ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వర్సిటీల మేనేజర్లు



సంప్రదాయ వస్త్రధారణలో యువతులు





ప్రత్యేక వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థులు



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థినులు



ఏయూ విద్యార్థుల థింసా నృత్యం



కృష్ణా వర్సిటీ విద్యార్థుల నృత్యహేళ

రాజకీయాల్లో ఉన్నంత వరకూ వైఎస్సార్ సీపీతోనే..

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: నియోజకవర్గంలో తనపై జనసేన, టీడీపీ మైండ్ గేమ్ ఆడుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో శుక్రవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవంతి శ్రీనివాసరావు ఇక్కడ పోటీ చెయ్యరని.. పార్టీలో ఉండరని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. చంద్రబాబు వచ్చినా.. పవన్ కల్యాణ్ వచ్చినా.. ఇక్కడ నుంచే పోటీ చేస్తానని, వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తానన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే అందరి లక్ష్యమన్నారు. జనసేన, టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చేస్తామని భ్రమపడి అధికారులను బెదిరిస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

నేటి నుంచి ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవంలో భాగంగా ఈ నెల 6, 7 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ (ఏపీహెచ్‌సీ) 46వ వార్షిక సమావేశం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ప్రొఫెసర్, అడ్వైజర్ కె.తిమ్మారెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ సమావేశం జరుగుతుందన్నారు. చారిత్రక కథనాల పరిశోధనకు వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, ప్రముఖ విద్యావేత్తలు, చరిత్రకారులు, పండితులు, పరిశోధకులను ఒక చోట చేర్చుతుందన్నారు. రాష్ట్ర మాజీ డీజీపీ సి.ఆంజనేయరెడ్డి ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.మధుకుమార్, ఏపీహెచ్‌సీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఎస్.మురళీమోహన్, కొప్పర్తి మూర్తి, బి.ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద బాధితులకు ఐదేళ్లలో రూ.27.11 కోట్ల పరిహారం

ప్రమాదాలకు బాధ్యత విద్యుత్ సంస్థలదేనని స్పష్టం చేసిన ఏపీఈఆర్సీ

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపులో అనుసరిస్తున్న నిబంధనల విషయంలో వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త నిబంధనలను నిర్దేశిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గత నెలలో విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో సవరించిన (ఏపీఈఆర్సీ) రెగ్యులేషన్ నిబంధనల ప్రకారం విద్యుత్ ప్రమాదం ఎలా జరిగినా.. దానికి కారకులు ఎవరైనప్పటికీ బాధితులకు సంబంధిత విద్యుత్ సంస్థలే పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి స్పష్టం చేసింది. వినియోగదారుల నివాస సముదాయాల్లోనూ, విద్యుత్‌ను వినియోగించే ప్రతి చోటా ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కచ్చితంగా తనిఖీ చేసి, ఎక్కడా ఎలాంటి లోపం లేదని నిర్ధారించుకున్న తరువాతే అనుమతినివ్వాలని ఆదేశాలిచ్చింది. అదేవిధంగా విద్యుత్ సంస్థలు పరిహారం చెల్లింపు విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఏపీఈఆర్సీ సూచించింది. ఈ ఆదేశాలు తక్షణమే రాష్ట్రమంతటా అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. విద్యుత్ వ్యవస్థ కారణంగా విద్యుదాఘాతానికి గురైన బాధితులకు ఈపీడీసీఎల్ సంస్థ సకాలంలో పరిహారం చెల్లిస్తోందని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాల కారణంగా జంతువులు గాని, మనుషులు గాని మరణించినా, వికలాంగులైనా ప్రమాదానికి గల కారణాలను సంస్థ విచారించి తప్పిదం ఉన్నట్లు తేలితే బాధితులకు నష్ట పరిహారాన్ని నిబంధనల మేరకు ఏపీఈపీడీసీఎల్ ఎప్పటికప్పుడు చెల్లిస్తోందని వివరించారు. గత ఐదేళ్లలో ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో విద్యుదాఘాతానికి గురైన బాధితులకు సంస్థ చెల్లించిన నష్ట పరిహారం వివరాలను ఆయన ప్రకటించారు. ఏపీఈఆర్సీ నిర్దేశించిన నిబంధనల మేరకు సంస్థ విచారణ అనంతరం 2018 నుంచి 2023 వరకు విద్యుత్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన మనుషులు, జంతువులు, గాయపడిన వారికి మొత్తంగా 931 మంది ప్రమాద బాధితులకు రూ.27.11 కోట్ల పరిహారాన్ని ఈపీడీసీఎల్ చెల్లించినట్లు తెలిపారు. ఇందులో 475 మందికి రూ.24. 13 కోట్లు, 456 మంది జంతువుల యజమానులకు రూ.2.98 కోట్ల పరిహారాన్ని అందజేసినట్లు సీఎండీ పృథ్వీతేజ్ వివరించారు.

పరిశ్రమల స్థాపనకు ఎస్ఈజెడ్ అనుకూలం



మాట్లాడుతున్న వరప్రసాద్

మద్దిపాలెం: విశాఖ ప్రత్యేక ఆర్థిక మండలి(వీఎస్ఈజెడ్)లో మౌలిక సదుపాయాలు, వసతులు అందుబాటులో ఉన్నాయని ఆ సంస్థ డెవలప్‌మెంట్ కమిషనర్ వరప్రసాద్ వెల్లడించారు. ఆర్అండ్‌బీ జంక్షన్ దరి ఓ హోటల్‌లో పలు సంస్థల ప్రతినిధులతో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్ఈజెడ్‌లో కొత్త యూనిట్ల స్థాపనకుగానూ సింగిల్ విండో మెకానిజం.. కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీల శాఖ, ఎక్సైజ్‌శాఖ, కార్మికశాఖల నుంచి అనుమతులు పొందడంలో సహాయపడుతుందన్నారు. ఎగుమతులు, ఉపాధి అవకాశాల్లో వృద్ధి గురించి ఆయన సోదాహరణంగా వివరించారు. సదస్సులో భాగంగా వీఎస్ఈజెడ్ యూనిట్ల స్థాపన, కస్టమ్స్, జీఎస్టీ తదితర అంశాలపై చర్చించారు. వీఎస్ఈజెడ్ అధికారులు, సిబ్బంది, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

అల్లిపురం: లింక్ రైళ్ల ఆలస్యంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ (12864) శుక్రవారం 10.35 గంటలకు బయలుదేరాల్సి ఉండగా.. మధ్యాహ్నం 12.30 గంటలకు, చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ (12839) ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో ఉదయం 10 గంటలకు బయలుదేరాల్సి ఉండగా 11.30 గంటలకు బయలుదేరాయి.

123 కిలోల గంజాయి పట్టివేత

పద్మనాభం: ఒడిశా రాష్ట్రం చిత్రకొండ నుంచి కారులో విశాఖకు తరలిస్తున్న రూ.6లక్షలు విలువ చేసే 123 కిలోల గంజాయిని శుక్రవారం విజయానందపురం జంక్షన్‌లో పట్టుకున్నారు. సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపిన వివరాలివీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు సమీపంలోని పద్మాపురానికి చెందిన కొర్రా గోపాల్, కుట్నాయక్ రవి నాయక్, హుకుంపేట మండలం గన్నేరుపుట్టుకు చెందిన పంగి వరప్రసాద్, డుంబ్రిగుడ మండలం పిట్టగుడకు చెందిన బురిడి రామకృష్ణ, ఒడిశా రాష్ట్రం కోరపుట్టు సమీపంలోని పాడువకు చెందిన పింకు బొర మారుతి.. కారులో విశాఖపట్నానికి గంజాయి రవాణా చేస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, పద్మనాభం పోలీసులు విజయానందపురం లేఅవుట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో గంజాయిని తరలిస్తున్న వీరిని పట్టుకున్నారు. కారుతో పాటు 123 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, వీరి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను భీమునిపట్నం కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.